క్లుప్తంగా

పాఠశాల ఆకస్మిక తనిఖీ



కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని రంగాపురం పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, విద్యార్థులను బోర్డుపై గణాంకాలు చేయించి, పాఠాలు చదివించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మన ఊరు–మన బడి పనులపై ఆరా తీశారు.

కేజీబీవీ భవనం పరిశీలన

కేటీదొడ్డి: మండల కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న కేజీబీవీ భవన పనులను సోమవారం ఎంఈఓ సురేష్ తనిఖీ చేశారు. పనుల పురోగతిని ఏఈ మోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో కూడిన సిమెంట్, ఇసుకను వాడాలని, నల్లటి ఇసుకను వాడుతున్నందుకు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్నటి తెల్ల ఇసుక వాడాలని సూచించారు.

సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మృతి

శాంతినగర్: వడ్డేపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఉప్పల గోపాలకృష్ణమూర్తి (98) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. 20 ఏళ్లపాటు సింగిల్‌విండో అధ్యక్షుడిగా వ్యవహరించారు. అంతేగాక శాంతినగర్ పట్టణం స్థాపనకు, రవీంద్ర ఎయిడెడ్ పాఠశాల ఏర్పాటుచేసి రెండేళ్లపాటు కరస్పాండెంట్‌గా విధులు నిర్వహించి విద్యాభివృద్ధికి కృషిచేశారు. ఆదర్శ రైతుగా గుర్తింపుపొంది రైతులకు ఆధునిక వ్యవసాయం, ఆధునిక వంగడాల సాగుకు ఎంతో కృషిచేశారని వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల ప్రజలు స్మరించుకున్నారు. ఈయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలి

రాజోళి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తుగా ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని సీపీఎం నాయకుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వేసవికాలం సందర్భంగా నీటిని అందిస్తున్న వనరులన్నీ ఎండిపోయి, తీవ్ర నీటి ఎద్దడి ఎదురయ్యే వరకు అధికారులు సమయం వృథా చేయకుండా ప్రత్యామ్నాయాలను సిద్ధం చేసుకోవాలన్నారు. గతంలో నీటి ఎద్దడి సమస్య తీవ్రమై, ఎండాకాలంలో పల్లెలు గొంతెండి పోయాయని అలాంటి ఘటనలు ఎదురు కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. తుంగభద్ర నదిలో నీటి కుంటలు ఏర్పాటు చేసుకుని, నీటిని తాగాల్సి వచ్చిందని, ఇప్పటికే పలు చోట్ల నీరు పూర్తిస్థాయిలో రావడం లేదని తెలిపారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోండి

అయిజ: నాగర్‌దొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఈనెల 31 వరకు మాత్రమే సాగునీటిని సరఫరా చేస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు నాగిరెడ్డి సోమవారం ప్రకటనలో కోరారు. కాల్వలకు మరమ్మతు చేసేందుకు ఏప్రిల్ నెలలో సాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, మండలంలోని రైతులు ఆయకట్టు పొలాలకు అవసరమైన మేరకు సాగునీటిని పారించుకోవాలని సూచించారు.

రిజర్వాయర్ సందర్శనకు అనుమతించండి

గద్వాల క్రైం: గట్టు మండలం చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించేందుకు పోలీసుశాఖ నుంచి అనుమతి ఇవ్వాల్సిందిగా సోమవారం డీఎస్పీ రంగాస్వామిని అఖిలపక్షం నాయకులు కలిశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అనుమతి లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. వివిధ పార్టీల నాయకులు ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడే అవకాశం ఉందన్నారు. పోలీస్‌శాఖకు సహకరించాలని తెలిపారు. డీఎస్పీని కలిసిన వారిలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వెంకట్‌స్వామి, అతికూర్ రహెమన్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆస్తిపన్ను చెల్లించండి

అయిజ: ఆస్తిపన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ నరసయ్య సోమవారం ప్రకటనలో కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని నివాస గృహాలు, వ్యాపార సంస్థల భవనాలకు ఇప్పటి వరకు కొంతమంది ఆస్తి పన్ను చెల్లించలేదని, ఈనెల 31 వరకు చెల్లించనివారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మండలంలోని చెనుగోనిపల్లిలో ప్రధానచౌరస్తాలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో గ్రామస్తులు ఒక్కసారిగా భయందోళనకు గురయ్యారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకుచ్చారు. ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

వేసవి వ్యాపారాలు షురూ

- గ్రామగ్రామాన వెలిసిన జ్యూస్ సెంటర్లు, మొబైల్ వాహనాలు
- జిల్లాలో ఐస్‌క్రీం ఫ్యాక్టరీలకు మంచి డిమాండ్
- ప్రతి ఏడాది రూ.కోట్లల్లో వ్యాపారం
- కరోనా తర్వాత ఈ ఏడాదిపైనే ఆశలు



శాంతినగర్‌లోని ఐస్ ఫ్యాక్టరీలో ఐస్‌క్రీంలు తయారు చేస్తున్న సిబ్బంది

రాజోళి: వేసవి వ్యాపారాలు ఊపందుకున్నాయి. నిన్న మొన్నటిదాకా నలుగురు కలిస్తే చాయ్ తాగే వారంతా ప్రస్తుతం జ్యూస్ సెంటర్ల వద్ద, పండ్ల దుకాణాల వద్ద ప్రత్యక్షమవుతున్నారు. వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు ప్రజలు పడుతున్న తపన వ్యాపారాలకు ఊతమిస్తుంది. ఒక చిన్న పాటి షెడ్డు వేసి పుచ్చకాయల దుకాణం తెరిస్తే అక్కడే రోజు రూ.వేలల్లో వ్యాపారం నడుస్తుంది. రానున్న రోజుల్లో మరింత పెరిగే ఎండలను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు శీతల పానియాలు, పండ్లు, జ్యూస్‌లు అమ్ముతున్నారు.

గ్రామగ్రామాన వెలుస్తున్న జ్యూస్ సెంటర్లు

జిల్లాలో దాదాపు 80 శాతం గ్రామాల్లో వేసవికాలం వచ్చిందంటే కూల్‌డ్రింక్ దుకాణాలు తెరిచేవారు. అందులో సాధారణంగా సోడా, లెమన్, షర్బత్, లభించేవి. ప్రస్తుతం వాటితో పాటుగా, మజ్జిగ, లస్సీ, నన్నారి, మిక్స్‌డ్ ఫ్రూట్ జ్యూస్ లాంటివి అందుబాటులో ఉండటంతో వేసవి వ్యాపారాలకు ప్రత్యేకంగా ఆదరణ లభిస్తుంది. ఈ సెంటర్లు మాత్రమే కాక, మొబైల్ వాహనాల ద్వారా గ్రామాల్లో చెరుకు రసం, బత్తాయి రసం లాంటి జ్యూస్‌లు ప్రజలకు అందిస్తున్నారు. దీంతో ప్రజలకు తాము వేసవిలో తాగాలనుకున్న జ్యూస్‌లు అందుబాటులో రావడం, తక్కువ ధరకు లభిస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని మహిళలకు గ్రామాల్లో వెలిసిన జ్యూస్ సెంటర్లు, మొబైల్ వాహనాలు బాగా ఉపకరిస్తున్నాయి.

ఐస్ ఫ్యాక్టరీలకు పెరిగిన డిమాండ్

ప్రస్తుతం జిల్లాలో ఐస్ ఫ్యాక్టరీలకు మంచి డిమాండ్ ఉంది. వేసవి వచ్చిందంటే చాలు, వారికి రూ.లక్షలలో వ్యాపారం జరుగుతుంది. జిల్లాలో పెద్ద స్థాయిలో ఉండే ఫ్యాక్టరీలకు 5 వరకు ఉన్నాయి. ఇప్పటికే వ్యాపారం మొదలుకాగా, ఐస్ క్రీం అమ్మే ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో ఉన్నాయి. వారు ఫ్యాక్టరీల వద్ద వివిధ రకాల ఐస్‌క్రీంలను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి, గ్రామాల్లో తిరుగుతూ అమ్మకాలు చేస్తుంటారు. వీటికి తోడు ఇతర శుభకార్యాలకు కూడా అమ్మకాలు చేస్తూ, తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకుంటున్నారు.

ఈ ఏడాదిపైనే ఆశలు..

రూ.లక్షలు పెట్టుబడి పెట్టినా రెండేళ్ల నుంచి పెద్దగా లాభాలు రాలేదని వ్యాపారులు అంటున్నారు. కరోనా లాక్‌డౌన్, ఆంక్షలు విధించడంతో గత రెండేళ్ల వ్యాపారాలు కాలేదు. దీనికి తోడు చల్లని పదార్థాలకు దూరంగా ఉండాలనే వైద్యుల సలహాలు కూడా కొంత దెబ్బతీశాయని, ప్రస్తుతం ఈ ఏడాదిపైనే పూర్తి ఆశలున్నాయని వ్యాపారులు అంటున్నారు. ఈ క్రమంలో వ్యాపారాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సక్రమంగా జరిగితే పుచ్చకాయలు, జ్యూస్ సెంటర్లు, కొబ్బరికాయలు, శీతల పానీయాల దుకాణాలు వ్యాపారాలు ఊపందుకోనున్నాయి.

కరెంట్ బిల్లులో రాయితీ ఇవ్వాలి



మేము ఐస్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసేందుకు రూ.లక్షల పెట్టుబడి పెట్టాం. ప్రతి వేసవిలో మూడు నెలలు బాగా బిజీగా ఉంటుంది. వీటితో పాటు ఇతర శుభకార్యాలు కూడా చేస్తుంటాం. రెండేళ్లు కొంత నష్టాలు చవి చూశాం. దీన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రభుత్వం మాలాంటి వ్యాపారులకు కరెంట్ బిల్లులో రాయితీ ఇవ్వాలని కోరుతున్నాం.

– రఘు, ఐస్ ఫ్యాక్టరీ యజమాని, శాంతినగర్

ఈ ఏడాదిపైనే ఆశలు



రెండేళ్లు కరోనా కారణంగా వ్యాపారాలు అంతంత మాత్రంగానే సాగాయి. ఒక ఏడాది పూర్తిగా దుకాణాలే తెరుచుకోలేదు. దీంతో బాగా నష్టపోయాం. వ్యాపారం బాగా జరిగితే ఈ ఏడాది కొంత ఊరట కలుగుతుంది. ప్రతి రోజూ రూ.2వేల వరకు వ్యాపారం సాగుతుంది. ప్రస్తుతం ఎండలు కూడా ముదురుతుండటంతో వ్యాపారాలు ఊపందుకుంటున్నాయి.

– గిరి, జ్యూస్ సెంటర్, శాంతినగర్

బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం పాటుపడుతున్నాడని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని మల్లెందొడ్డిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పార్టీకి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. కర్ణాటకలో బీజేపీ అధికారంలో ఉన్న, తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న వివిధ పథకాలను అక్కడ ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా రైతుల మోటార్లకు మీటర్లు బిగించే ప్రభుత్వం కావాలా, ఉచిత కరెంట్ ఇచ్చే ప్రభుత్వం కావాలా రైతులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత పేదల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి వాటిని పార్టీలకతీతంగా అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి

ధరూరు: హిందూ ధర్మాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పేరు పునరావాస కేంద్రంలో కొత్త శివాంజనేయ స్వామి ఆలయంతో పాటు బొడ్రాయి, ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే దంపతులు ముఖ్య అతితులుగా హాజరై మాట్లాడారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయాలు ఉండడం వల్ల ప్రతి ఒక్కరూ పూజలు నిర్వహించుకుని శాంతిని నెలకొల్పేందుకు దోహదం చేస్తుందన్నారు. దేవాలయానికి కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రఘువర్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ మాశమ్మ, ఎంపీటీసీ రేణుక, కృష్ణకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి?

- సామాజిక మాధ్యమాల్లో వైరల్

గద్వాల క్రైం: పసికందు మృతికి వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మానవపాడు మండలం జల్లాపురానికి చెందిన జనార్దన్, భార్య శాంతి జీవనోపాధి నిమిత్తం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లిచౌరస్తాలో ఉంటున్నారు. అయితే శాంతికి ఆదివారం పురిటినొప్పులు రావడంతో సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లారు. మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సిందిగా సూచించారు. వెంటనే వారు జిల్లా ఆస్పత్రికి వచ్చారు. ఇక్కడి వైద్యులు శస్త్ర చికిత్స చేయగా, పసికందు మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. సోమవారం పసికందును పూడ్చే క్రమంలో శరీర భాగంపై ఎర్రటి ఛాయలు ఉండడంతో కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పసికందు మృతి చెందినట్లు అనుమానించారు. ఈ విషయం పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయంపై జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్‌ను వివరణ కోరగా.. ప్రసవ సమయంలో శిశువు ఎదురు కాళ్లతో తల్లి గర్భం నుంచి బయటికి వచ్చే క్రమంలో శ్వాస అందక మృతి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సంఘటనలో కూడా అదే జరిగిందన్నారు. చాలా అరుదుగా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటాయని, వైద్యుల నిర్లక్ష్యం లేదన్నారు. ఇదే విషయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు వివరించామన్నారు.

10 ఎర్రమట్టి ట్రాక్టర్ల పట్టివేత

శాంతినగర్: ప్రభుత్వ అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తున్న పది ట్రాక్టర్లను, జేసీబీని సోమవారం మధ్యాహ్నం పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వడ్డేపల్లి మండలంలోని తనగల గట్టు నుంచి జేసీబీ, పది ట్రాక్టర్లతో ఎర్రమట్టి తరలిస్తున్నారనే సమాచారంతో సంఘటన స్థలానికి వెళ్లి వాహనాలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. అనంతరం తహసీల్దార్ జయరాములుకు వాహనాలను అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కర్నూల్‌లో ఆరోగ్యశ్రీ వర్తింపజేయండి

అలంపూర్: ఏపీలో తెలంగాణ ప్రజలకు ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని యూత్‌ఫర్ పబ్లిక్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఆర్‌వీ శేషు, మధుసూదన్ రెడ్డి కోరారు. విజయవాడలోని మంగళగిరిలో ఉన్న ఆరోగ్యశ్రీ ట్రస్టు భవనంలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌కేర్ ట్రస్టు సీఈఓ హరేందర్‌ప్రసాద్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉన్న అలంపూర్, గద్వాల నియోజకవర్గ ప్రజలు వైద్యానికి కర్నూల్‌పై ఆధారపడతారని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో సరిహద్దులో ఉన్న నడిగడ్డ ప్రాంత ప్రజలు వైద్యానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని వినతిలో వివరించారు. ఈ ప్రాంత ప్రజలకు మేలు కలిగే విధంగా కర్నూల్‌లో అలంపూర్, గద్వాల ప్రజలకు ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, జర్నలిస్టులకు ఆరోగ్యబీమా వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



డైరీ అందజేస్తున్న సీపీఎస్ నాయకులు

గద్వాలన్యూటౌన్: ఉద్యోగులు పడుతున్న మానసిక వేదనను అర్థం చేసుకుని ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు కోరారు. సోమవారం రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం తరపున రూపొందించిన డైరీని ఏటీఓ గాయత్రి, ఎస్‌టీఓ వెంకట్‌రెడ్డిలకు స్థానిక ట్రెజరీ కార్యాలయ ఆవరణలో అందించారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు చెల్లించాల్సిన కొన్ని బిల్లులు ఆలస్యం అవుతున్నాయని, త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, రమేష్, నరసింహ, ఎల్లస్వామి, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

శాంతినగర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామాపురం సర్పంచ్ బీసన్నగౌడ్ కోరారు. వడ్డేపల్లి మండలంలోని రామాపురంలో సోమవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ శేషన్‌గౌడ్ సోమవారం ప్రారంభించారు. వైద్యులు యాకుబ్ బాషా ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి, అద్దాలను అందించారు. కంచుపాడులో మొదటి రోజు 134 మందికి, తక్కశీలలో 168 మందికి కంటి పరీక్షలు చేశారు.

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలో సోమవారం కంటివెలుగు కార్యక్రమం కొనసాగింది . బుక్కాపూర్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో 110 మందికి పరీక్షలు చేసినట్లు మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ తెలిపారు.



కంచుపాడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో సోమవారం డాక్టర్ రిజ్వాన తన్వీర్, సర్పంచ్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కంటివెలుగు కార్యక్రమంను ప్రారంభించారు. 134మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, 37మందికి అద్దాలు ఇచ్చినట్లు తెలిపారు.

దేశం సుభిక్షంగా ఉండాలని పూజలు

రాజోళి: అన్నదాతలకు అనుకూల వర్షాలు ఉండి. పాడి పంటలతో జీవించాలని ఆర్మీ జవాన్ వీరేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని భ్రమరాంబ ఆదిశ్వేర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. దేశప్రజలు సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. వీరితో పాటు రైతులు, యువకులు పూజల్లో పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న జవాన్, రైతులు

అర్హులను గుర్తించాలని వినతి

గద్వాల న్యూటౌన్: పట్టణంలో డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ప్రచురించిన జాబితాలో అర్హులుగా ఉన్న లబ్ధిదారులను అనర్హుల జాబితాలో చేర్చారని బీజేపీ కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫిర్యాదు చేశారు. 36వ వార్డు పరిధిలోని వడ్లవీధి, వడ్డెవీధిలో నివసించే 131 మంది అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని వార్డు కౌన్సిలర్ జయశ్రీ తెలిపారు. వీరిని అనర్హుల జాబితాలో చేర్చి ప్రచురించారన్నారు. దీనిపై తిరిగి విచారణ చేయాలని కోరారు. 23వ వార్డులో అర్హులుగా ఉన్నప్పటికి వారిని అనర్హుల జాబితాలో చేర్చారని కౌన్సిలర్ అనిత అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్‌కు విన్నవించారు. విచారణ చేసి, అర్హులకు న్యాయం చేయాలని విన్నవించారు.



వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ అనిత

సభకు తరలిన సీపీఎం నాయకులు



బహిరంగ సభకు తరలివెళ్తున్న సీపీఎం నాయకులు

రాజోళి: జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీపీఎం బహిరంగ సభకు సోమవారం మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాల వల్ల సాధారణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, కార్పొరేట్ సంస్థలను బాగు చేసేందుకు మోదీ ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపట్టిన జనచైతన్య యాత్రలో భాగంగా బహిరంగ సభకు హాజరైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, లక్ష్మన్న, మంజునాథ్, భాష, కృష్ణ పాల్గొన్నారు.

కేంద్రం తీరు అప్రజాస్వామికం



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాల: రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట బైఠాయించారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాధరణ చూసి మోదీ తట్టుకోలేక పోతున్నారని ధ్వజమెత్తారు. కార్పొరేట్ సంస్థలు దేశ సంపదను దోపిడీ చేస్తున్నా పట్టించుకోకుండా ప్రశ్నించే గొంతును మాత్రం నొక్కేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోవు రోజుల్లో బీజేపీ తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జహంగీర్, ఇసాక్, కిఫాయత్, జమాల్, రఘు, కౌసర్‌బేగ్, మైనుద్దీన్, గోపాల్, మహిబూబ్ పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన

అలంపూర్ రూరల్: పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలోని కిశోర బాలికలకు రక్తహీనత, చేతుల శుభ్రతపై అంగన్‌వాడీ టీచర్లు సోమవారం అవగాహన కల్పించారు. జిల్లా కార్యదర్శి ఎమేలమ్మ మాట్లాడుతూ.. పాలకూర, తోటకూర తీసుకోవడం వల్ల శరీరంలో రక్తం వృద్ధి అవుతుందని తెలిపారు. పెసర్లు, మినుములు, రాగులు, కొర్రలు, జొన్నలు, సద్దలు తీసుకోవడం వల్ల శరీరంలో కాల్షియం, ఐరన్ సమపాలల్లో అందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ, హెచ్‌ఎం ఫార్కనా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మల్దకల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటారని సీడీపీఓ కమలాదేవి సూచించారు. పోషణ పక్షంలో భాగంగా సోమవారం మండలంలోని మల్లెందొడ్డిలో గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సరైన పోషణతోనే ఆరోగ్యం

గట్టు: సరైన పోషణతోనే మనమంతా ఆరోగ్యంగా ఉండగలమని, మహిళలు, చిన్నారులు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలని సర్పంచ్ ధనలక్ష్మి తెలిపారు. జాతీయ పోషణ మహోత్సవంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు.

నిరుద్యోగులకు అండగా బీఎస్పీ



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కేశవరావు

ఎర్రవల్లిచౌరస్తా: నిరుద్యోగులకు బీఎస్పీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. సోమవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ చేసి 30లక్షల మంది నిరుద్యోగ యువత జీవితాలతో ఆడుకుంటుందన్నారు. గత ఎన్నికల్లో నియోజకవర్గంలో మూడు ప్రాజెక్టులను నిర్మిస్తామని హామీ ఇచ్చి రైతులను నట్టేట ముంచిందన్నారు. హామీల పేరుతో ప్రజల ఓట్లను దండుకొని నిట్ట నిలువునా మోసం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో బహుజనుల పాలన తీసుకువచ్చేందుకు రాజ్యాధికార యాత్రను చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 29 నుంచి అలంపూర్ నియోజకవర్గంలో ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ ఐదు రోజుల పాటు చేపట్టే యాత్రకు బహుజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా స్వేరో ఆధ్వర్యంలో అలంపూర్ చౌరస్తాలో రెండు నెలల పాటు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని, 50 కంపెనీలు అందించే వివిధ ప్లేస్‌మెంట్స్‌ను నిరుద్యోగ యువత సద్వినియోగించుకోవాలని తెలిపారు.

కుటుంబపాలనలో గద్వాల నాశనం



వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

నడిగడ్డ హక్కుల పోరాట సమితి చైర్మన్ రంజిత్‌కుమార్

గద్వాల: ఒకే కుటుంబ పాలనలో గద్వాల ప్రజలు నలిగిపోతున్నారని, వారి పాలనలో అభివృద్ధి కంటే అవినీతే అధికంగా ఉందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ ఆరోపించారు. నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్రలో భాగంగా 11 రోజు సోమవారం మండలంలోని శెట్టిత్మకూర్, గోనుపాడు, సంగాల, మర్లపల్లి, జిల్లెడబండ మీదుగా పాదయాత్ర సాగింది. మార్గమధ్యలో ఉన్న రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా గ్రామాలలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 50 ఏళ్లలో గద్వాల ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు వ్యక్తిగత ప్రయోజనాల పై చూపిస్తున్న శ్రద్ధ.. ప్రజా సమస్యలపై పూర్తిగా కరువైందని విమర్శించారు. ఇప్పటికీ గ్రామాలలో అర్హులైన వారికి పింఛన్లు అందడం లేదన్నారు. గ్రామాలలో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి అందించే వరకు మా పోరాటం కొనసాగుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికలలో ప్రజల ఆత్మగౌరవాన్ని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. గద్వాలలో బహుజన జెండా ఎగిరే వరకు ప్రశ్నించే గొంతుకగా ఉద్యమిస్తామన్నారు. అనంతరం పాదయాత్ర ధరూర్ మండలం పారుచర్లకు చేరుకుంది. పాదయాత్రలో బుచ్చిబాబు, లవన్న, నాగేష్, వీరేష్, అవనిశ్రీ, రంగస్వామి, శ్రీనివాస్, గోవిందు, అంజి, విష్ణు, మునెప్ప, తిమ్మప్ప, ప్రేమ్‌రాజ్, ఏసు, భీమన్‌గౌడ్, ఉపేంద్ర, రాము, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.